మానవప్రకృతిలో సహజవికృతి

# అపురూపం అసలురూపం

అవసరాల రామకృష్ణారావు

ముగ్గురు కూతుళ్ళూ ఒక్కసారే పుట్టింటికి చేరుకోడం చూసి తల్లి ఆశ్చర్యపోయింది. "ఆ కొంపకీ ఆ కాపరానికీ ఒక్క నమస్కారం. చిన్న విషయం చెబితే వాళ్ల సంగతంతా అర్థమై పోతుంది. వినవే అమ్మా! మొన్న వాళ్ళింట్లో, మా గదికి నూరు గజాలదూరంలోవున్న పాకలో కాఫీ గుండ దంపించుకున్నారు. మనిషిజన్మ ఎత్తేక కష్టం సుఖం ఆలోచించి ముందుచెప్పాలా? తలుపు గడియవేసుకుని చెవులో వేళ్ళెట్టుకున్నా ఆ చప్పుడుకీ ఆ ఘాటుకీ ప్రాణం సొమ్మసిల్లి పోయిందనుకో" అంది పెద్దకూతురు.

"కట్టుకున్న మొగుడికే లేకపోతే ఇంకెందు కమ్మా ఆకాపురం? మొన్న ఏమైందనుకున్నావ్ చల్లగాలికని ఆయనా నేనూ మల్లె పందిరక్రింద పండుకున్నాం. ఓ రాత్రివేళ ఓ మల్లెపూవు నా మీద పడింది. పక్కనుండి ఆయన చూస్తూనే ఉన్నారు సుమీ. ఓ పడిందా అని అడగలేదు. ఓ దెబ్బ తగిలిందా అని అడగలేదు. దగ్గరకు పిలువ లేదు, చేరదీయలేదు. నా మనసు విరిగిపోయి వెంటనే వచ్చేసానంతే" అంది రెండోది.

"ఎంతో బాధపడితేగాని నేను ఏవిషయమూ పైకి చెప్పనే చెప్పనూ. నా కథ వింటే కఠిన శిలలైనా కన్నీళ్లు కారుస్తాయి. పడుకోవడానికని నాకు మూడు పరుపులు వేశాడు. కడుపులో అంత కక్ష ఉంటే యిలాగే తీర్చుకోవాలా? రాత్రి అయిదు నిమిషాలు నిద్రలేదు. పొద్దుట లేచి ఆపరుపులు తీయించి చూద్దునూ ఒక మూలని ఓ సెనగ గింజ! అమ్మ జ్ఞాపకానికివచ్చి బావురుమన్నాను!"

ముగ్గురు చెప్పిందీ తల్లి ఎంతో బాధతో వింది. కన్నీళ్ళు కార్చింది.

"ఇంకెందుకర్రా ఇంతింత కోడంటికాలుపడి మనస్సు విరిగిపోయాక? ఏమో అనుకున్నాను గానీ మీనాన్నా యింతే. ఈమధ్య ఏంజరిగిందా, ఆయన ఒంట మనిషిచేత బంగాళా దుంపలు కూడా, పెసరపప్పు పచ్చడీ చేయించాడు. ఇంట్లో ఉన్నాడుగదా కష్టసుఖం ఆమాత్రం విచారించ వద్దు? ఆ బంగాళాదుంపలు కటుకూ కటుకూ కొరకలేక పళ్ళు నొప్పెట్టిపోయాయి. దవడ వాచి పోయింది. పెసరపప్పు పచ్చడి తినలేకా, మింగ లేకా పోనీ పారెయ్యలేకా నాలిక వాచి గొంతు పుండై పోయింది. ఈ "సీతారామ" కష్టాలుఇంక పడలేం పదండి అమ్మమ్మ దగ్గిరకి" అంది.

* * *

ఇలాంటివాళ్లు ఉన్నారా? అనిమీరు అడుగరు. నాకు తెలుసు. ఎవరో ఒక బంధువురాలు ఇంతటిసుకుమారి మీకు పరిచయమయ్యే ఉంటుంది. తప్పుదారిని పట్టిస్తే స్త్రీ ఎన్నెన్ని వికృతరూపాలు చూపిస్తుందో, ఎన్ని అవతారాలు ధరిస్తుందో మీకు కొంతవరకైనా పరిచయమై ఉండాలి. తయారు చేసే మనుషులుంటే ఎన్నిరకాలగా తయారరయే ఆడవాళ్ళైనా ఉన్నారు. పక్క మించి లేవకుండా జరిపించేవాళ్లుంటే ఎన్నిరకాల జబ్బులబడి సంకటాలైనా విజృంభించవచ్చు. "మంచినీళ్లు విషంకదా, గ్లూకోజు పడదుగదా!" అనుకుంటూనే మూడుపూటలా వాయించి, మధ్యేమధ్యే పానీయాలు సేవించి రాత్రి సోలడు పాలుత్రాగి "అమ్మా, కళ్ళు తిరుగుతున్నాయే" అనేవాళ్లు మీకు కనబడకపోతే నన్నడగండి చూపెడతాను.

* * *

"ఒరే అన్నయ్యా నువ్వెంత కారప్పూస తిన గలవురా?" అని అడిగింది చెల్లి.

"రూపాయిది. నువ్వో?" అన్నయ్యఅడిగాడు. చెల్లెలు రెండుచేతులూ జాపింది.

"ఇదిగో యింతా" అప్పుడే వస్తున్న ప్రైవేటు మేష్టారు యీ మాటలు విని అనుకున్నాడు.

"పిల్లలకి తెలివితేటలు ఎక్కువగానేవున్నాయి. తిండిలోఉన్న యీ ముందడుగు చదువులోకి"

మళ్ళితే బాగుండును!" మేష్టార్ని చూసి పిల్లలు లేవలేదు. పైగా చెల్లాయివచ్చి తొడమీద కూర్చుంది. అన్న వీపుదగ్గిర నిలబడ్డాడు.

"మేష్టారూ మీయింట్లో యివాళ కూరేం చేసుకున్నారూ?"

"కూరచేసుకోలేదమ్మా, వంకాయి పులుసు పచ్చడి చేసుకున్నాం."

"అదా? చాలా బాగుంటుంది కదే చెల్లీ?"

"ఆలస్యమైపోతోందిపుస్తకాలుతెచ్చుకోండి" మేష్టరు కోప్పడ్డాడు. ఇద్దరూ దిక్కు మొహాలు వేసుకుని నెమ్మదిగా నడుచుకుంటూ తాతయ్య దగ్గిరకు వెళ్ళేరు. యిద్దర్నీ చెరోచేత్తోనూ ఎత్తుకుని ముద్దెట్టుకున్నాడు.

"ఏమే ఆలాఉన్నారు?" అతి దీనవదనంతో చెల్లి అటుచూపించింది.

"పిల్లలకి ఒంట్లో ఏం బాగులేదు మేష్టారూ, రేపురండి."

"ఇలా అయి ఇవాళకి నాలుగురోజులైంది-సరే జీతమిస్తున్నప్పుడు నాకేం?" మేష్టారు వెళ్ళిపోయారు. "నువ్వెంత మంచివాడివి తాతయ్యా!" అన్నాడు అన్నయ్య.

*　　*　　*

మంచిబుద్ధులూ, చక్కటి శిక్షణా నేర్ప వలసినకాలం చిన్నతనం. పిల్లల్ని ఖైదీలో పెట్టినట్టు చూడమనీ, ఒక్కచూపుతో గజగజ ఒణికించమనీ ఎవరూ అనరు. హద్దుమీరిన అనురాగం, అలవిమాలిన అవురూపం పిల్లల్ని ఏవిధంగా తయారుచేస్తాయో మాత్రం అప్పుడప్పుడు తెలుసుకోవాలి. ఇరవైయోఏట స్కూలుఫైనలు మూడవ సారి ఫేలయిన కొడుకుని చూసి బాధపడేకన్నా చిన్నప్పుడు ఉయ్యాల బల్లమీద తొడపైకూర్చోపెట్టుకుని, నోటిలో సిగరెట్టు పెట్టి వెలిగించడం మానదలుస్తే మంచిది. వారంరోజుల్లో అయిదవ సారి పుట్టింటికి వచ్చిన కూతుర్ని చూసి దుఃఖపడే కన్న చిన్నప్పుడు ఏది అంటే అది నెరవేర్చడం మానెయ్యాలి. "అందరి లాగా చాకిరీ చేసుకునే ఖర్మం మాపిల్లకేం పట్టిందీ దానికి అటువస్తువయిటు పెట్టవలసిన అవుసరం ఏముందీ?" అని గుండె చరుచుకునే యిల్లాలుకన్న "మహారాణీ కూతురైతే మాత్రం, అత్తారింటికి వెళ్లక తప్పుతుందా, కాపరంచేయక తప్పుతుందా? దానికి నాలుగుపనులూ రావాలి. ఇంకోళ్ళని శ్రమపెట్టే అవసరం దానికేమిటి?" అనుకుని ఆ దృష్టితో కూతుర్ని తయారుచేసే అత్తగార్ని అల్లుళ్లసంతోషంతో తల్చుకుంటారు.

*　　*　　*

"చిన్నవాడివి, కబుర్లేగాని కష్టంసుఖం నీకేం తెలుసు? నలుగురు పుట్టిపోయాక మిగిలిన నలుసు యిది. మాప్రేమంతా దీనిమీద కేంద్రీకరించింది. దాన్ని అపురూపంగా, అల్లారు ముద్దుగా చూసుకోడం ఓ అపరాధమా?" అనేది మా పెద్దక్క.

"ఒక్కగానొక్క ఆడపిల్ల, మళ్ళీ ముందూ వెనకా ఎవరూలేరు. శిక్షణ అన్నపేరుతో మా బంగారు తల్లిని బాధించాలా? దీనిమీదే పంచ ప్రాణాలు పెట్టుకుని బ్రతుకుతున్నామే యీ చిన్నప్రాణిని అడిగింది ఇవ్వకుండా వేధించాలా?" అనేవారు మా బాబాయిగారు. వీరిద్దరితోనూ నేను ఏకీభవించలేను. ఒక్కపిల్లే ఉన్నప్పుడు జీవితమంతా ఆ చిన్నారి వెలుగుమీదే ఆధారపడి ఉన్నప్పుడు దానిమీద మరింత శ్రద్ధ చూపించి, మరింత నేర్పుతో పెంచాలి. రేపొద్దున్న దానికి చదువుగాని పనిపాటలుగాని రానప్పుడు "మావాళ్లు నన్నిలా తయారు చేశారు" అని బాధపడకుండా చూసుకోవాలి. అడిగిందల్లా యివ్వడమూ, చెప్పినట్లల్లా చెయ్యడమే అభిమానం అనిపించుకోదు. హద్దులో ఉన్నప్పుడే దేనికైనా అందం. నాలుగు గట్ల మధ్య ఉన్నప్పుడే చెరువుకి అందం. చెరువులో ఉన్నప్పుడే చేపకి అందం.

*　　*　　*

పిల్లల్ని నెత్తి కెక్కించుకుని తండ్రులూ, భార్యల్ని గగనపథానికెత్తే భర్తలూ తత్ఫలితాల్ని అనుభవిస్తూనే ఉన్నారు. అపురూపం చేస్తున్న వాళ్ళ మాట అలా ఉంచి అది పొందుతున్న పెద్దవాళ్లు దాన్ని దూరం చేసుకోకపోతే ఆ దుష్ఫలితాల్ని జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు అనుభవించక తప్పదు. ★